keratam.in
www.digital.keratam.in
కెరటం
బుధవారం, 05 ఏప్రిల్ 2023
పేజీలు 08

## రామవరం ప్రాంతానికి హక్కు పత్రాలు కల్పించాలి

- పాలకుల నిర్లక్ష్యం ఎందుకు.. 1/70దోషం తొలిగేదెట్లా?
- ఈ ప్రాంతానికి ఇంటి పట్టాలు అందని ద్రాక్షేనా..
- పార్లమెంటు సభ్యులు హక్కు పత్రాల కోసం కృషి చేయాలి
- పదో వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ

3

# రాష్ట్రంలో లీకేజీ జాతర

- ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం
- బాధ్యులను తక్షణమే విధుల నుంచి తప్పించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్
- బీఎస్పీ నిరసనలో భాగంగా పోస్టల్ ఉద్యమానికి శ్రీకారం

2



## లీకులకు భాధ్యత ఎవరు ?



- ప్రశ్నించే వారిని ద్రోహులుగా చూస్తారా..
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అరెస్ట్ తగదు
- వరుస లీకేజీలపై బాధ్యత వహించి ప్రభుత్వాన్ని రద్దు చేయాలి
- టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు
- వరంగల్ జిల్లాలో మరో హిందీ పేపర్ లీక్ పై ధ్వజం

2



## దళిత బంధుతో నూతన కాంతులు..

- దళిత బంధు ద్వారా దళితుల ఆర్థిక అభివృద్ధి...
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

2






# రాష్ట్రంలో లీకేజీ జాతర

- ప్రశ్నాపత్రాల లీకేజీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం
- బాధ్యులను తక్షణమే విధుల నుంచి తప్పించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్
- బీఎస్పీ నిరసనలో భాగంగా పోస్టల్ ఉద్యమానికి శ్రీకారం



**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రశ్నా పత్రాల లీకేజీ పర్వం కొనసాగుతుందని, మొన్న టీఎస్పీఎస్సి నేడు పదవ తరగతి పరీక్షా ప్రశ్నాపత్రాలు ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ మండిపడ్డారు..ఈ విషయంలో సీఎం కేసీఆర్ మౌనముద్ర విడాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పోస్టల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 30 లక్షల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు జరిగిన అన్యాయం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఖచ్చితంగా ఒక ప్రకటన విడుదల చేయాలని, లేని పక్షంలో ప్రశ్నాపత్రాల లీకేజీలో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని భావించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని సిట్ అధికారులు పిలిపించి తూతూ మంత్రంగా స్టేట్మెంట్ రికార్డ్ చేసి పంపించారని, ఈ వ్యవహారంలో పాత్రధారులు సూత్రధారులు బయటపడాలంటే ఆయనను తక్షణమే విధుల నుంచి తప్పించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని, కాన్ఫిడెన్షియల్ రూములోకి చైర్మన్ తప్ప ఇతరులకు ఎవరికీ అనుమతి ఉండదని, అలాంటిది ప్రశ్నాపత్రాలు ఎలా లీకవుతాయని నిలదీశారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ మీడియాకు ముఖం చాటేస్తూ తిరుగుతుంటే ఈ వ్యవహారంలో మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు స్పందిస్తున్నారని, అసలు స్పందించాల్సిన వ్యక్తి స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఇకనైనా స్పందించాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా అసలు ఏమీ జరగనట్లు, తనకు ఏమీ తెలియదన్నట్లు సీఎం కేసీఆర్ వ్యవహరించడం సరికాదని అన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకుపై ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించి అసలు ఈ విషయంలో దోషులు ఎవరో చెప్పాలని అన్నారు. అంతేకాకుండా ఈ విషయమై సీబీఐ, హైకోర్ట్ సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సాయి, నాగుల రవి కుమార్, బనోత్ పవన్ కళ్యాణ్, తాటిపాముల హరికృష్ణ, షేక్ ఇర్ఫాన్, బుర్రి రవిచంద్ర, సంషేర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# లీకులకు భాధ్యత ఎవరు ?

- ప్రశ్నించే వారిని ద్రోహులుగా చూస్తారా..
- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అరెస్ట్ తగదు
- వరుస లీకేజీలపై బాధ్యత వహించి ప్రభుత్వాన్ని రద్దు చేయాలి
- టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు
- వరంగల్ జిల్లాలో మరో హిందీ పేపర్ లీక్ పై ధ్వజం



**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నిరుద్యోగుల, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఇదేమని ప్రశ్నించే వారిని ద్రోహులుగా చూస్తున్నారని నాగా సీతారాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసి జైలుకు పంపుతున్నారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా జైల్లో పెట్టిందని విమర్శించారు. టిపిఎస్సిపి పేపర్ లీకేజీ ఘటన తర్వాత వికారాబాద్ జిల్లాలో పదవ తరగతి పరీక్షా పత్రం లీకేజీ అయిందని, దీనిపై పదవ తరగతి బోర్డు ముందు ఆందోళన చేసిన యూత్ కాంగ్రెస్ విషయంలో తప్పిదాలను సరిదిద్దుకోవాల్సిన ప్రభుత్వం శివసేనారెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఈరోజు మళ్ళీ వరంగల్ జిల్లాలో పదవ తరగతి హింది ప్రశ్న పత్రం లీకేజీ అయ్యిందని అన్నారు. అసలు ఈ ప్రభుత్వం లీకుల ప్రభుత్వం అని అన్నారు. వరుస లీకులతో ప్రజల జీవితాలతో, విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. వరుస లీకేజీలపై బాధ్యత వహించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శివసేనారెడ్డిని అరెస్టు చేసినంత మాత్రాన తమ యూత్ కాంగ్రెస్ పోరు ఆగదని, 7 రోజులపాటు శివసేనారెడ్డిని రిమాండ్ కు తరలించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కుట్రకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



## కంటి వెలుగు ప్రారంభించిన సర్పంచ్ పద్మ

**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవిపల్లి మండలం సంజయ్ నగర్ గ్రామంలో 2వ విడత ఉచిత కంటి వెలుగు కార్యక్రమం భూక్య పద్మ సర్పంచ్ మార్కెట్ యార్డ్ నందు ప్రారంభించినారు. ఇట్టి కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. 8 సంవత్సరాలు నిండిన వారందరు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ తెలియజేశారు. ఇట్టి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, సురేందర్ రావు వార్డు మెంబర్, సుధాకర్ వార్డు మెంబర్, సంజీవరెడ్డి పంచాయతి కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## దళిత బంధుతో దళితులు జీవితాలలో

# నూతన కాంతులు..

- దళిత బంధు ద్వారా దళితుల ఆర్థిక అభివృద్ధి...
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

దళిత బంధుతో దళితులు జీవితాలలో నూతన కాంతులు సీఎం కేసీఆర్ నింపారని, దళిత బంధు ద్వారా దళితుల ఆర్థిక అభివృద్ధి చెందుతున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం లోని సమితి సింగారం గ్రామం నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక అమలు చేస్తున్న దళిత బంధు పథకంలో భాగంగా కోదాడ శివ కేశవులు దళిత బంధు పథకంలో మొదటి విడతలో అశోక్ లైలాండ్ వాహనాన్ని ప్రారంభించగా, మిగిలిన నిధులతో ఏర్పాటు చేసిన టైలర్స్ షాప్‌ను... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల జీవితాలలో వెలుగుల నింపి భావితరాలకు బంగారు బాట వెయ్యాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం అమలు చేస్తున్నారని అన్నారు. దళితులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దళిత బంధు పథకం ప్రవేశపెట్టారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. దళిత బంధు పథకం ఒక్క రూపాయి బ్యాంకు లోన్ లింకేసు లేకుండా పది లక్షల రూపాయలను నేరుగా దళితుల అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, దళితబంధు లబ్దిదారులు పాల్గొన్నారు.



# న్యాయవాద సంఘం బాధ్యతల స్వీకరణ

## న్యాయవాద సంఘం అధ్యక్షుడిగా రమేష్ కుమార్ మక్కడ్



**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అతి పెద్దదైన కొత్తగూడెం న్యాయవాద సంఘం అధ్యక్షుడిగా రమేష్ కుమార్ మక్కడ్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కోర్టు ఆవరణంలోని లైబ్రరీ హాల్లో ఆయనతోపాటు నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలు చేపట్టింది. ఉపాధ్యక్షునిగా దుంద్ర రమేష్, ప్రధాన కార్యదర్శిగా రావిలాల రామారావు, సంయుక్త కార్యదర్శిగా కాసాని రమేష్, కోశాధి కారిగా సంతోష్ లాల్ సాహు, క్రిడా కార్యద ర్శిగా పిట్టల రామారావు, గ్రంథాలయ కార్యదర్శిగా యాస యుగంధర్, మహిళ ప్రతినిధిగా ఏ.మనో రమ కూడా బాధ్యతలు చేప ట్టారు. ఈ ఎన్నికల్లో గెలుపొందిన వారికి సీనియర్ న్యాయవాది వట్టికొం డ సురేష్ బాబు చేతుల మీదుగా ఎన్నికల అధికారి పలివెల సాంబశివరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నూతనంగా బాధ్యతలను స్వీకరిం చిన సభ్యులను పాత కమిటీ వారు శాలు వలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గానికి కొత్తగూడెం బార్ అసోసి యేషన్ సంబంధించిన అన్ని రికార్డులను, గత కార్యవర్గం, నూతన కార్యవర్గానికి స్వాధీనపరిచారు న్యాయవాదులను ఉద్దేశించి రమేష్ కుమార్ మక్కడ్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి అన్ని విధాలుగా అహర్నిశలు శక్తివంచన లేకుండా పనిచేస్తానని, తమ కార్యవర్గ సభ్యులు అందరికీ అన్ని వేళల్లో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తారని తెలిపారు. న్యాయవాదులకు హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నించి గృహ సమస్య పరిష్కారానికి, న్యాయవాదులందరికి హెల్త్ కార్డులు వచ్చే విధంగా పనిచేస్తామని, సభాముఖంగా తెలుపుతూ,



కొత్తగూడెంలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో గత ఏడాది అధ్యక్షుడిగా పనిచేసిన అనుబ్రోలు రాంప్రసాద్ రావుతోపాటు గత కార్యవర్గం సభ్యులు భాగం మాధవరావు, మునిగడప వెంకన్న, సాదిక్ పాషా, ఆర్తి మక్కడ్, కె.శ్రీధర్, గాదె సునంద, సీనియర్ న్యాయవాదులు జలసూత్రం శివరాం ప్రసాద్, ఉదయ భాస్కరరావు, రేపాక వెంకటరత్నం, రవిచంద్ర, కె.పుల్లయ్య, లక్కినేని సత్యనారాయణ, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.








### రామవరం ప్రాంతానికి

## హక్కు పత్రాలు కల్పించాలి

- పాలకుల నిర్లక్ష్యం ఎందుకు.. 1/70దోషం తొలిగేదెట్లా?
- ఈ ప్రాంతానికి ఇంటి పట్టాలు అందని ద్రాక్షేనా..
- పార్లమెంటు సభ్యులు హక్కు పత్రాల కోసం కృషి చేయాలి
- పదో వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ

**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

భారతదేశ ప్రజలు భారతదేశ (ఎల్లలు) హద్దులు ఉన్నంతవరకు ఎక్కడనైనను స్థిర నివాసం ఏర్పరచుకోవచ్చు, ఎక్కడ నైనను నివసించవచ్చు అని భారత రాజ్యాంగం హక్కు కల్పించినప్పటికీ రామవరం ప్రాంత ప్రజలకి నివాస ధ్రువీకరణ హక్కు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పదో వార్డ్ కౌన్సిలర్ మునిగడప పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పదో వార్డులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవో 76 ద్వారా సింగరేణి ఏరియాలో అన్యా క్రాంతము చేసుకొని 2020 నాటికి స్థానిక నివాసం ఏర్పరచుకున్న వారికి పట్టాలిస్తాం అన్నదానిలో రామవరం ప్రాంత పేరు లేకపోవడం బాధాకరమని ఇది రామవరం ప్రజలు చేసుకున్నశాపమా,పాపమా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం పేరుతో రామవరం ప్రజలకి పట్టాలు పొందే హక్కు లేకపోవడం వల్ల యాజమాన్య హక్కులు లేకుండా పోయాయని రామవరం ప్రాంతానికి పట్టిన 1/70 చట్టం యాజమాన్య హక్కుకి అందరి ద్రాక్షగా మారిందని ఆమె పేర్కొన్నారు.ఇప్పటికైనా పాలకులు కనీసం పొజిషన్ సర్టిఫికెట్స్ (హక్కు పత్రాలు) ఇప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అనేకమంది ఎంపీలు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహించి కూడా రామవరం ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహించారని ఆమె విమర్శించారు. జిల్లాల విభజన జరుగుతే నైనా జిల్లా పది కిలోమీటర్ల లోపు ఈ చట్టం తొలగించబడదని ప్రజలు విశ్వసించే వారిని, కానీ జిల్లా విభజన జరిగినా కూడా ఎందుకు సవరణ జరగటం లేదో అర్థం కాని అయోమయ స్థితిలో ప్రజలు ఉన్నారని ఆమె అన్నారు. రామవరం ప్రాంత ప్రజలు ఏం పాపం చేసుకున్నారమో అర్థం కావడం లేదని ఒకే మున్సిపాలిటీలో రెండు చట్టాలు ఏంటని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ప్లేన్ ఏరియా అని చెబుతూ రామవరం మాత్రం 1/70లో ఉందని చెప్పటం ఏంటని ఆమె ప్రశ్నించారు. ఈ చట్టం పేరుతో ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలకు భంగం కలగకుండా ఈ చట్ట సవరణకు ఎంపీ చర్యలు తీసుకోవాలని లేదంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రామవరం ప్రజలను సమీకరించి పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గంటడి కోటేశ్వరరావు,రాజాం,గోపి,సత్తి, చందు, జలీల్, మహిళా నాయకురాలు మార్తమ్మ,ఫాతిమా, లక్ష్మి, చారి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎండి.రజాక్

**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

జెవిఆర్ ఓసీలో ఓర్ మెన్లుగా పనిచేయుచున్న శివప్రసాద్, రాజేష్ కుమార్ సోమవారం నైట్ షిఫ్ట్‌కు టు వీలర్ పై వెళుతున్న క్రమంలో రాత్రి 8.00గంటలకు పశువులు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో రోడ్ ఆక్సిడెంట్‌కు గురై కాళ్లకు స్వల్ప గాయాలు అయినవి. మెయిన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓవర్ మెన్‌లను టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ రజాక్, రీజినల్ సెక్రెటరీ కూసన వీరభద్రం పరామర్శించడం జరిగినది. పరామర్శించిన వారిలో చిలక రాజయ్య, మోహన్ రెడ్డి, చిరంజీవి, నర్సింగరావు తదితరులు వున్నారు.

# 4 కొత్త గనుల నుండి 100 లక్షల టన్నుల బొగ్గు

- గనుల వారీగా పనులపై చర్చించిన సంస్థ ఛైర్మన్, ఎం.డి ఎన్. శ్రీధర్
- అనుమతుల సాధనకు, బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి కాల పరిమితుల సూచిక



**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరంలో 4 కొత్త ఓపెన్ కాస్ట్ గనుల నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలని ప్రణాళికబద్ధంగా ముందుకు పోతుంది. అలాగే రానున్న 3 సంవత్సరాల్లో ప్రారంభించాల్సిన 13 కొత్త గనులపై కూడా సంస్థ ఛైర్మన్ మరియు ఎం.డి ఎన్. శ్రీధర్ హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం నాడు సంబంధిత అధికారులతో ఒక ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, ప్రాజెక్టు ప్లానింగ్ జనరల్ మేనేజర్లు కొత్త గనులు ప్రారంభించవలసి ఉన్న ఏరియాల జనరల్ మేనేజర్లు



పాల్గొన్నారు.

రానున్న మూడు సంవత్సరాల్లో మొత్తం 13 కొత్త గనులను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ ఇప్పటికే దాదాపు అన్ని అనుమతులు లభించిన నాలుగు కొత్త గనులపైన, ఆ గనుల నుంచి ఉత్పత్తి చేయాల్సిన బొగ్గు, రవాణా తదితర అంశాలపైన సంస్థ ఛైర్మన్ ప్రధానంగా చర్చించారు. ఈ నాలుగు గనులకు ఇంకా మిగిలి ఉన్న ఒకటి రెండు అనుమతులను త్వరగా సాధించాలని, నిర్దేశించుకున్న సమయానికి గనులు ప్రారంభించాలని ఆయన కాలపరిమితులు సూచించారు.

**ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకు:**

ఏడాదికి కోటి టన్నుల నాణ్యమైన బొగ్గును అందించే ఈ బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయి. చివరిగా బొగ్గు గని ప్రాంతంలో ఉన్న కొన్ని చెట్లను ఆ రాష్ట్ర అటవీ శాఖ వారు తొలగించే పని ఒక్కటే మిగిలి ఉంది. రానున్న మూడు నెలల్లో ఈ పని పూర్తయితే బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తారు. కాగా బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను యాజమాన్యం ఇప్పటికే పూర్తి చేసింది. సింగరేణి ఉన్నతాధికారులు త్వరలోనే ఒడిశా రాష్ట్రానికి వెళ్లి అక్కడి ప్రభుత్వ అధికారులు, రాష్ట్ర అటవీశాఖ వారితో సంప్రదించాలని నిర్ణయించారు. ఈ ఏడాది కనీసం 50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరపాలని, తర్వాతి సంవత్సరాల్లో ఏడాదికి 10 నుండి 15 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు.

**వీకే ఓపెన్ కాస్ట్ (కొత్తగూడెం):**

ఏడాదికి 53 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల ఈ గని నుండి ఈ తొలి ఏడాది మాత్రం 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. గతంలో ఉన్న వి.కె-7 భూగర్భ గనినే ఓపెన్ కాస్ట్ గనిగా మారుస్తున్నప్పటికీ ఆ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి అటవీ భూమికి రాష్ట్ర అటవీశాఖ నుండి అనుమతి అవసరమై ఉంది. ఇప్పటికే సంబంధిత అటవీశాఖ అధికారులు స్థల పరిశీలన చేసి నివేదికను ఉన్నత అధికారులు సమర్పించారు. త్వరలో న్యూఢిల్లీలో జరిగే ఒక ఉన్నతస్థాయి అటవీ శాఖ సమావేశంలో దీనికి అనుమతి లభించనున్నది. ఈ అనుమతి లభించిన వెంటనే ఉత్పత్తి ప్రారంభించడానికి యాజమాన్యం అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసింది.

**గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి):**

గతంలో గోలేటి భూగర్భ గనిగా ఉన్న ఈ ప్రాంతంలో ఏడాదికి 35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం గల ఓపెన్ కాస్ట్ గని ప్రారంభిస్తున్నారు. ఈ గనికి సంబంధించి పలు అనుమతులు ఇప్పటికే లభించినప్పటికీ ఇంకా కొన్ని అనుమతులు సాధించవలసి ఉన్నది. ఇవి కూడా లభిస్తే ఈ ఏడాది ఇక్కడి నుండి కనీసం 5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన పనులు మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను సంస్థ ఛైర్మన్ ఆదేశించారు.

**జె.కె. ఓపెన్ కాస్ట్ మైన్ (ఇల్లందు):**

గతంలో ఇక్కడ నిర్వహించిన 21 ఇంక్లైన్ గని, కొంత జె.కె-5 ఓసి గనికి సంబంధించిన ప్రాంతాన్ని కలుపుతూ ఏడాదికి 20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ కొత్త గనికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ఉత్పత్తి తొలి సంవత్సరం కనుక ఇక్కడ నుండి కనీసం 10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇంకా మిగిలి ఉన్న అనుమతులను వెంటనే సాధించాలని సంస్థ ఛైర్మన్, ఎం.డి. ఎన్. శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ నాలుగు గనుల నుండి ఈ ఏడాది సుమారు 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. దీనితో సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సుసాధ్యం కానున్నదని సంస్థ ఛైర్మన్ ఎన్. శ్రీధర్ అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎన్. బలరామ్ (ఫైనాన్స్ అండ్ పర్సనల్), డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు, ఎన్.వి.కె. శ్రీనివాస్ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ జె.ఆల్విన్, అడ్వైజర్ సురేంద్ర పాండే (ఫారెస్ట్రీ), జీఎం (కో ఆర్డినేషన్) ఎం.సురేష్, జీఎం (సీపీపీ) సి.హెచ్. నరసింహారావు, జి.ఎం (మార్కెటింగ్) కె.సూర్యనారాయణ, జీఎం (పీపీ) కె.కొండయ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలు, కొత్తగూడెం కార్పొరేట్ నుంచి వివిధ విభాగాల జీఎంలు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను

# జయప్రదం చేయండి

**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

నేడు నిర్వహించబడే దళిత జన బాంధవుడు, పీడిత తాడిత ప్రజల ఆశాజ్యోతి భారత ప్రథమ డిప్యూటీ ప్రధానమంత్రి స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భారతరత్న, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పూల రవీందర్, భారతరత్న సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద హనుమంతు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పురి నవతన్, మాల మహానాడు జిల్లా నాయ కులు గాదం రాజేందర్, జి.పురుషోత్తం పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా వారు మంగళ వారం బర్మా క్యాంప్ రామవరం, 14 నెంబర్, త్రీ ఇంక్లైన్, ఫోర్ ఇంక్లైన్, ధన్బాద్, రుద్రంపూర్, గౌతమ్ పూర్, పెనగడప ప్రాంతాలు సందర్శించి అక్కడి దళిత కుటుంబాలు దర్శించి వారికి ఆహ్వాన పత్రిక ఇచ్చి అధిక సంఖ్య లో హాజరుకావాలని సగవురవంగా ఆహ్వానించారు

నేడు ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సర్కిల్ వద్ద గల పాత అంబేద్కర్ విగ్రహం పక్కన ఉన్న స్థలంలో స్థానిక శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ



కార్యక్రమం జరుగుతుందని, అనంతరం హెడ్ ఆఫీస్ వద్ద గల తాసిల్దార్ ఆఫీస్ ముందు ఉన్న అంబేద్కర్ భవన్లో జయంతి వేడుకలు జరుగుతాయని అనంతరం ప్రేమ విందు కూడా ఉంటుందని తెలియజేశారు. జయంతి వేడుకల ఉత్సవ కమిటీకి కన్వీనర్గా సోదరులు గుండా రమేష్ నియమితులైనారని అత్యంత వైభవంగా జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా ఎస్పీ జి.వినీత్, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ టి.విజయేంద్ర రావు, డాక్టర్ జి కనకరాజు, అందెల ఆనందరావు రిటైర్డ్ సింగరేణి జిఎం, డాక్టర్ శాంతన్ బాబు, డాక్టర్ ఇరుకు బాబురావు, డాక్టర్ దారా సురేందర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తదితరులు కాక ప్రోటోకాల్ ప్రకారంగా అధికార అనధికారులందరూ పాల్గొని ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్ని సంఘాలకు పిలుపునిచ్చారు. ఆహ్వానించిన వారిలో రామవరం నుండి సోమరాజు హరినాథ్ రంగారావు త్రీ ఇంక్లైన్ వెంకటేష్ ఈశ్వర్, ఫ్లోరింగ్ లైన్ మైల రాజేశ్వరరావు, ధన్బాద్ బీర బాబు రావు, బల్ల శ్రీను, రుద్రంపూర్ సారిక, శివ, దేవరపల్లి శ్రీనివాస్, గుమ్మడి వీరయ్య, జోసెఫ్ గౌతంపూర్, ఓదెలు సంపత్, బాలకృష్ణ, పెనగడప ఆర్ఎంపి విజయభాస్కర్, శ్రీనగర్ కాలనీ జాన్సన్, రాములు, బెంజమిన్, గడదీసి రాములు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**శామ్, ఏప్రిల్04(కెరటం ప్రతినిధి)**

ఏఐసీసీ,పిసిసి పిలుపులో భాగంగా హత్ సే హత్ జోడో యాత్ర పాల్వంచ మండలం తోగ్గూడేంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ సామాన్య ప్రజల గోస పట్టని ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు, అధిక ధరల రూపంలో ప్రజలను హింసిస్తున్నరాన్నరు. మోసపూరిత కెసిఆర్ సర్కార్ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, అసం పూర్తిగా సాగునీటి ప్రాజెక్టులను వదిలిపెట్టి కాళేశ్వరం రూపంలో లక్ష కోట్ల రూపాయలను దండుకుందని, పోడుభూములకు పట్టాలిస్తామని చెప్పి అమాయక ఆదివాసి బిడ్డలను మోసం చేసిందని, పేదలకు డబుల్ బెడ్రూంలను ఇవ్వకుండా కంటితుడుపు చర్యగా అక్కడక్కడ 10, 20 నాసిరకం ఇళ్లను మాత్రమే ఇచ్చిందని,ధరణి పేరుతో రైతులను ధగ ధగా చేసిందని అన్నారు. దళిత బంధు పేరుతో దళితులను వంచించిందని, కేంద్ర ప్రభుత్వం అర్థం కానీ పన్నులు, పెట్రోల్, గ్యాస్, డీసెల్ ధరలను పెంచి సామాన్యుని జీవితంపై పెను భారాన్ని మోపుతున్నయని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు అభాండాన్ని వేసుకుని ప్రజల దైనందిన జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు .రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేసిన భారత్ జోడో పాదయాత్ర విజయవంతం కావడంతో ప్రతి గ్రామంలో హత్ సే హత్ యాత్ర రాహుల్ గాంధీ సందేశాన్ని కరపత్రం రూపంలో ఇంటింటికి తీసుకువెళ్తున్నాం అన్నారు. రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కొనలేక ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కొండం వెంకన్న గౌడ్, బత్తుల వెంకటేశ్వరరావు, కృష్ణ, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.